## బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు చేయాలి

### ములుగు ఎస్పీ శబరీశ్


మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ములుగు, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా దర్యాప్తు ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు, వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలని ఎస్పీ పీ శబరీశ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ముందుగా ఈ నెలలో నమోదైన కేసుల వివరాలను స్టేషన్ వారిగా ఆరా తీసి, కేసుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలపై జరిగే నేరాల్లో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించాలన్నారు. అనంతరం ఎస్పీ ఈ నెల 12 నుంచి 16వరకు జరిగిన మినీ మేడారం, 26న జరిగిన శివరాత్రి, 27న జరిగిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విధి నిర్వహణలో భాగంగా బందోబస్తు నిర్వహించిన పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. సమావేశంలో ఓఎస్డీ గీతే మహేశ్‌బాబా సాహెబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివంఉపాధ్యాయ, డీఎస్పీలు రవీందర్, కిశోర్‌కుమార్, సీఐలు అజయ్, రమేశ్, శ్రీనివాస్, శంకర్, కుమార్, రవీందర్, ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, సతీశ్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజుద్దీన్, సూరి, రాజ్‌కుమార్, కృష్ణప్రసాద్, తిరుపతి, వెంకటేశ్, జగదీశ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు

## ప్రజలకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష

### పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

మంగపేట, ఫిబ్రవరి 28 : తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ శ్రీరామ రక్ష అని ఆ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో శుక్రవారం సాయంత్రం పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతుందన్నారు. నెరవేరని హామీలను ఎండగడుతూ నిత్యం ప్రజలకు చేరువగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రతీ ఇంటికి ఏదో ఒక రూపంలో అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, కొమరం ధనలక్ష్మి, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేశ్, చిట్టిమల్ల సమ్మయ్య, చిలకమర్రి రాజేందర్, కోరం సంతోష్, బుట్టో, శంకర్, శ్రీనివాసచారి, శ్రీను, అర్జున్, గుడివాడ శ్రీహరి, సాంబయ్య, సతీశ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ

గణపురం, ఫిబ్రవరి 28 : డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన 143 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధన, పాఠశాల నిర్వహణ తదితర విషయాలపై డీఈవో రాజేందర్ పర్యవేక్షణలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం మండలంలోని చెల్పూర్ పాఠశాలలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి కాగిత లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎంఈవో ఊరగొండ ఉప్పలయ్య ప్రారంభించారు. విద్యార్థులను ఆకర్షించే విధంగా తరగతి గదిని ఎలా తీర్చిదిద్దాలి, విద్యా సామర్థ్యాలు, అభ్యసనా ఫలితాలకు సంబంధించి పిల్లలను ఎలా సన్నద్ధం చేయాలనే దానిపై రిసోర్స్ పర్సన్ల ద్వారా అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలలో ప్రత్యక్షంగా విద్యార్థులకు నేర్పిస్తూ విద్యా ప్రమాణాలు పెంచేలా కృషి చేయాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక హెచ్ఎం అశోక్, కమ్యూనిటీ మొబలైజ్ అధికారి సామల రమేశ్, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టెన్త్‌లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

### భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 28 : పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనపై ఎంఈవోలు, హెచ్ఎంలతో జిల్లా సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లాలో చేపట్టాల్సిన పనులపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగనున్న టెన్త్ పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 121 పాఠశాలలకు చెందిన 1,725 మంది బాలురు, 1,724 మంది బాలికలు మొత్తం 3,449 మంది హాజరవుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, సబ్జెక్టుల్లో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గత సంవత్సరం నూరు శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను కారణాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గత సంవత్సరం 92.96 శాతం ఫలితాలు సాధించామని, ఈ సంవత్సరం దానిని అధిగమించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి రామానుజం చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేశారు.

**పీఎం శ్రీ సర్వశిక్షా అభియాన్ పనులు పూర్తి చేయాలి**

జిల్లాలో పీఎం శ్రీ 8 పాఠశాలలకు, సర్వ శిక్షా అభియాన్ 5 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ నిధులతో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 20 వరకు అన్ని పనులు పూర్తి కావాలని, ఎంఈవోలు నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

**సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయండి**

సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పుష్కరాల ఏర్పాట్లుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ, విద్యుత్ శాఖల అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఇరిగేషన్ 4, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం 7, మిషన్ భగీరథ 15, దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం 28, విద్యుత్ 11, మొత్తం 65 పనులు పూర్తి చేయాల్సి ఉన్నదని తెలిపారు. త్వరలో ఎన్నికల కోడ్ ముగియనున్నందున పనులు సత్వరమే చేపట్టేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా స్నాన ఘట్టాలు, రహదారులు, తాగునీటి సరఫరా, శానిటేషన్, విద్యుత్, భద్రత, పార్కింగ్ వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పనుల ప్రగతి పై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విజయలక్ష్మి, అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఈవో రాజేందర్, డీపీఆర్‌వో శ్రీనివాస్, టీజీడబ్ల్యూ ఈఐడీసీ ఈఈ నరేందర్ రెడ్డి, పరీక్షల విభాగం ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, విద్యుత్ శాఖ డీఈ పాపిరెడ్డి, దేవాదాయ శాఖ డీఈ, దేవస్థానం కార్య నిర్వహణ అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యదర్శి చంద్రశేఖర్, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

### సేవాలాల్ జయంతి వేడుకల్లో మంత్రి సీతక్క


సేవాలాల్ చిత్రపటానికి మొక్కుతున్న మంత్రి సీతక్క

ములుగురూరల్, ఫిబ్రవరి 28 : మన సాంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంత్ సేవాలాల్ గుడి వద్ద జయంతి వేడుకలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించగా మంత్రి సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకర హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి మొక్కులు చెల్లించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సేవాలాల్ ఎంచుకున్న భక్తి, విశ్వాసం, నమ్మకంతో ఆశయాలను బంజారాలు ముందుకు తీసుకెళ్లి రేపటి తరానికి సేవాలాల్ సేవలను అందించాలని అన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బంజారాలు జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పోరిక గోవింద్‌నాయక్, ఉత్సవ కమిటీ కన్వీనర్లు పోరిక శ్రవణ్‌కుమార్, జయరామ్, సభ్యులు జర్పుల బాలునాయక్, ఆంగోత్ రాజునాయక్, పోరిక రాహుల్‌నాయక్, మూడ్ కసన్‌సింగ్, తిరుపతి, వినాయక్, తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఏఎన్ఎం మృతి


జిగినేపల్లి సురేఖ (ఫైల్)

గోవిందరావుపేట, ఫిబ్రవరి 28 : మండలంలోని పస్రా గ్రామానికి చెందిన ఏఎన్ఎం జిగినేపల్లి సురేఖ (45) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. సురేఖ పదేళ్లుగా పస్రా పీహెచ్‌సీలో పనిచేస్తూ పలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేది. వృత్తి పరంగా న్యాయం చేస్తూ ప్రతి ఒక్కరితో అప్యాయంగా మెదిలిన సురేఖ మృతితో పలువురు ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతురాలికి భర్త సంజీవరావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేఖ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## నిర్ణీత సమయంలో సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్


రైస్ మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

గణపురం, ఫిబ్రవరి 28 : ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో రైస్ మిల్లర్లు సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్, బుర్రకాయలగూడెం జానకీరామ్ ఆగ్రో ఇండస్ట్రీస్‌ను జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 సీజన్‌కు సంబంధించిన యాసంగి 2024-25, వానకాలం (సీఎంఆర్)ను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి గడువులోగా లక్ష్యాన్ని పూర్తిచేసి సహకరించాలని వారు సూచించారు.

## మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

### భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్


రాజీవ్ నగర్‌లో మంచినీటి సరఫరాను పరిశీలిస్తున్న శ్రీనివాస్

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 28 : వేసవిలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఎలాంటి మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కారల్‌మార్క్స్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీల్లో వాటర్ సరఫరా, మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలోని ఎలక్ట్రిషన్లకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, మెటీరియల్స్, అటెండెన్స్ రిజిస్టర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్ మెయింటెనెన్స్ సరిగా ఉండాలని, విధులు సరిగా నిర్వర్తించాలన్నారు. పట్టణంలో వీధి దీపాలకు అంతరాయం ఉండకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. వాటర్ లీకేజీలు లేకుండా వెంటనే పైపులైన్ మరమ్మత్తులు చేయించాలని వాటర్, ఎలక్ట్రిషన్ సిబ్బందికి సూచించారు. అలాగే నీటిని వృథా చేయకుండా ట్యాప్ ఆఫ్ చేసుకోవాలని, ఒక్కొక్క వ్యక్తికి 135 లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఈ మానసను ఆదేశించారు.

## రైతులకు న్యాయం చేయాలి

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 28 : వెంకటాపురం, వాజేడు మండలాల్లో బొండు మిర్చి, మక్కజొన్న పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు అన్నారు. శుక్రవారం పాత్రపురం గ్రామంలో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్ పర్యవేక్షించి రైతులకు న్యాయం చేయాలన్నారు. రెండు మండలాల్లోని రైతులను దళారులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాడిశ కిశోర్‌కుమార్, ప్రశాంత్, సతీశ్, నర్సింహారావు, పాయల ప్రశాంత్, రాంకీ గణేశ్, తిలక్ పాల్గొన్నారు.

## 108లో మహిళ ప్రసవం

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 28 : మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన మహిళ 108 వాహనంలో శుక్రవారం ప్రసవించింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సునీత అనే మహిళ ఉదయం నుంచి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రాజలక్ష్మి, పైలెట్ కుమార్ వాహనాన్ని పక్కకు ఆపి పురుడు పోశారు. తల్లీ బిడ్డను 108 సిబ్బంది దవాఖానకు తరలించారు.

## మాజీ ఉపసర్పంచ్‌కు సిరికొండ పరామర్శ

గణపురం, ఫిబ్రవరి 28: మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ తాజా మాజీ ఉప సర్పంచ్ కొత్తపల్లి కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఈ సందర్భంగా కుమారస్వామి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## నకిలీ ఫోన్‌పే యాప్‌తో మోసం

కాటారం, ఫిబ్రవరి 28 : నకిలీ ఫోన్‌పే యాప్‌తో ఓ వ్యక్తి దుకాణాదారుడిని శుక్రవారం బురిడీ కొట్టించాడు. బాధితుడి కథనం మేరకు.. మండలకేంద్రంలో సత్య అనే వ్యక్తి ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం దుకాణానికి ఓ యువకుడు వచ్చి రూ.4వేలు విలువైన సామగ్రి కొనుగోలు చేశాడు. ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించి వెళ్లిపోయాడు. అనుమానం వచ్చి ఫోన్‌పే ఖాతా పరిశీలించగా డబ్బులు జమ కాలేదని గమనించిన సత్యం వెంబడించి భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. మోసం చేసిన వ్యక్తిది భూపాలపల్లి జిల్లా గొల్లబుద్దారంకు చెందినట్లుగా తెలిసింది. .

## మిర్చికి మద్దతు ధర ప్రకటించాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : ప్రభుత్వ సంస్థల ద్వారా మిర్చి కొనుగోలు చేసి క్వింటాళుకు రూ.25వేల చొప్పున చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రామన్నగూడెం గ్రామ పరిసరాల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ బృందం మిర్చి కల్లాలను శుక్రవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. నాయకులు బీరెడ్డి సాంబశివరెడ్డి, తుమ్మల వెంకటరెడ్డి, దావూద్, పొదిల్ల చిట్టిబాబు, ఎండీ గఫూర్, తీగల ఆగిరెడ్డి, జాగటి చిన్న, తోకల రవి, ధనుష్, నర్సింహులు, రాంబాబు, నాగులు, భాస్కర్, రంజిత్, రామారావు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్‌డే

- ములుగు, జయశంకర్ జిల్లాల్లో వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

ఏటూరునాగారం/ మల్హర్/ గోవిందరావుపేట/ వెంకటాపురం(నూగూరు)/ వాజేడు/ మంగపేట/ ములుగు రూరల్/ గణపురం/ కాటారం/ మహదేవపూర్(కాళేశ్వరం)/ చిట్యాల/ మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 28 : జాతీయ సైన్స్ డే వేడుకలు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు వివిధ సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సైన్స్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక, ప్రధానోపాధ్యాయులు మడే నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మల్హర్ మండలం తాడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు హెచ్ఎం తిరుపతి బహుమతులు అందజేశారు. గోవిందరావుపేట మండలకేంద్రంలోని బాలికల పాఠశాలలో విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు జన్య ఫౌండేషన్ వారి సహకారంతో గోల్డ్ మెడల్స్ అందించగా వాటిని ఎంఈవో దివాకర్ అందజేశారు. వెంకటాపురం(నూగూరు) మండలకేంద్రంలోని పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఎంఈవో జీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వాజేడు మండలకేంద్రంలోని పాఠశాలలలో ఏఎంవో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలించారు. ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్‌రావు, హెచ్ఎం సోయం ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మంగపేట మండల కేంద్రంలోని హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో మేనక, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ క్రాంతి పాల్గొన్నారు. ములుగు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం ఆధ్వర్యంలో వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కే సరిత విద్యార్థులకు క్విజ్ పోటలను నిర్వహించారు. విజేతలు రవళి, శిరీష, శ్రావ్య, శృతి, రష్మి, అలెక్స్, సునీతకు బహుమతులు అందజేశారు. ములుగులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం క్యాతం రాజేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలుకు బహుమతులను అందజేశారు. ఆర్యభట్ట సైన్స్ క్లబ్ కోఆర్డినేటర్ శిరుప సతీశ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గణపురం మండలం చెల్పూరు ఎంజీఎం హైస్కూల్‌లో విద్యార్థులచే సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఎగ్జిబిట్లతో సహా వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్లు, సైన్స్ నాటికలు, సైన్స్ సంతలు, వివిధ రకాల నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గ్యాదంగి సతీశ్ డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, రమాదేవి, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మధుకర్ పాల్గొన్నారు. కాటారం మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో సైన్స్ ఎక్స్ పో-2025 ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నూతన ఆవిష్కరణలు, సైన్స్ ఎగ్జిబిట్లు, సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. చైర్మన్ కరుణాకర్‌రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మహదేవపూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ ప్రాముఖ్యత, మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. చిట్యాల మండలకేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్ కుమార్ , కరస్పాండెంట్ ఎండీ రాజమహ్మద్ పాల్గొన్నారు. మొగుళ్లపల్ల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం భాగ్యశీర ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.


గోవిందరావుపేట: క్విజ్ పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులతో ఎంఈవో దివాకర్



వాజేడు : సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఎంవో మల్లారెడ్డి



మొగుళ్లపల్లి: మండలకేంద్రంలోని పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు


కాటారం : సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 28 : ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన గుండు నాగభూషణంను ఎస్పీ శాలువా కప్పి, పులమాలతో ఘనంగా సత్కరించారు. నాగభూషణం సతీమణి పద్మకు గృహోపకరణాలు అందజేశారు. ఏదేని సమస్య ఉంటే రిటైర్డ్ ఉద్యోగులు తనను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేష్, కిరణ్, శ్రీకాంత్, రత్నం, పోలీస్ అధికారుల సంఘం నేత యాదిరెడ్డి పాల్గొన్నారు.

## హత్యపై విచారణ వేగవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 28 : రాజలింగమూర్తి హత్యపై విచారణ వేగవంతం చేసి నిందుతులను కఠినంగా శిక్షించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని ఫకీర్‌గడ్డలోని రాజలింగమూర్తి కుటుంబ సభ్యులను శుక్రవారం ఉదయం పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు పరామర్శించారు. హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హన్మకొండ పౌరహక్కుల సంఘం నాయకులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి ఎన్‌ఆర్‌ఐల చేయూత

గణపురం, ఫిబ్రవరి 28 : మండలంలోని కర్కపల్లి గ్రామానికి చెందిన డాకూరి కృష్ణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా గ్రామానికి చెందిన కర్కపల్లి మాజీ సర్పంచ్ పెంచాల సౌమ్యా రవీందర్ దంపతుల కుమారుడు చరణ్‌రాజ్, కుమార్తె తేజ్ గాయపడిన వ్యక్తి కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కృష్ణారెడ్డి వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలుపగా వారు స్పందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. వారి తల్లిదండ్రులు శుక్రవారం కృష్ణారెడ్డి కుటుంబానికి డబ్బులు అందించారు.

## ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానలు

టేకుమట్ల, ఫిబ్రవరి 28 : మండలంలో కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన పల్లె దవాఖాల నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించడం లేదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్ అన్నారు. శుక్రవారం ఆయన పల్లె దవాఖాన భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించేందుకు పల్లె దవాఖానాలకు సుమారు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. టేకుమట్ల, గర్మిళ్లపల్లి, వెలిశాల గ్రామాల్లో భవనాలు పూర్తయిన నేటికీ ప్రారంభించకపోవడం దారుణమన్నారు. భవనం లేక టేకుమట్ల గ్రామపంచాయతీలోని ఒక గదిలో తాత్కాలిక సేవలు అందించడంతో రోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవనాలను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఒకరి మృతికి కారణమైన ఆరుగురిపై కేసు?

తాడ్వాయి, ఫిబ్రవరి 28 : చేపల వేటకు వెళ్లిన వారిలో ఒకరు చేపలు వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతిచెందగా మిగతా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. మండలంలోని వెంగ్లాపురం గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు గ్రామ సమీపంలోని జంపన్నవాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ వాగు వెంట ఉన్న విద్యుత్ స్తంభానికి వైర్లను తగిలించి చేపలు పడుతుండగా ఒడ్డున ఉన్న కృష్ణమూర్తి విద్యుత్ తీగలను ముట్టకోగా షాక్‌కు గురై మృతిచెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కృష్ణమూర్తి మృతి చెందింది విద్యుత్ తీగలు అనుకోకుండా తగిలా? లేకుంటే కావాలనే మిగతా వాళ్లు హత్య చేశారా అనే కోణంలో విచారణ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగించి చేపలు పట్టినందుకు ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## పశువులు మీద పడటంతో ఒకరికి గాయాలు

తాడ్వాయి, ఫిబ్రవరి 28 : బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై ఎదురుగా వచ్చిన పశువులు మీదపడటంతో మాడవి జోగేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కాటాపురంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మంగపేట మండలం రేగులగూడెంకు చెందిన జోగేశ్ కాటాపురం వచ్చి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న పశువులు ఒకదానిని ఒకటి పొడుచుకుంటూ వచ్చి జోగేశ్ బైక్‌పై పడటంతో తల, ముఖానికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు పశువులను తరిమి గాయాలపాలైన జోగేశ్‌ను మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

## ఒక మోటర్‌తో దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 28 : దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఒక మోటర్‌తో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. శుక్రవారం 247 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లో పంపింగ్ చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కాగా, ఎగువ నుంచి తుపాకులగూడెం సమ్మక్క బరాజ్‌లోకి 2,200 క్యూసెక్కులు నీరు వస్తుండటంతో ఒక గేటు ఎత్తి 750 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నట్లు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

## సీఎంకు ఉద్యమకారుడి పోస్టు కార్డు

ములుగురూరల్, ఫిబ్రవరి 28 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ములుగు జిల్లా కేంద్రానికి చెందిన టీయూఎఫ్ జిల్లా కార్యదర్శి గడ్డమీది భాస్కర్ ఉత్తరం రాసి పోస్టు చేశారు. ఉద్యమకారులు చేసిన ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రమని, 250 గజాల ఇంటి స్థలం,గుర్తింపు కార్డులు, ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉత్తరంలో పేర్కొన్నట్లు భాస్కర్ వివరించారు.

## కరెంట్ తీగలు అమర్చితే చర్యలు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 28 : చెరువులు, పొంట పొలాలు, అడవుల్లో కరెంట్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. శుక్రవారం దుంపిల్లగూడెం, రంగాపూర్ గ్రామాల్లో పాత నేరస్తుల ఇళ్లలో తనిఖీలు చేసి ఆయన మాట్లాడారు. చెరువులో చేపలు పట్టే సమయంలో నీటిలో కరెంట్ వైర్లు పెట్టొద్దన్నారు. పంట చుట్టూ, అటవీ ప్రాంతాల్లో సైతం అమర్చవద్దని తెలిపారు. ఇలా చేయడం వల్ల మనుషులు విద్యుత్ షాక్‌కు గురై చనిపోతున్నారన్నారు. పద్ధతి మార్చుకోకుండా విద్యుత్ తీగలను అమర్చితే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ములుగురూరల్, ఫిబ్రవరి 28 : ములుగు జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ కన్నయ్యలాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కోర్టులో పోలీస్, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సివిల్, వివాహ, కుటుంబ తగాదా కేసులు, మోటర్ వెహికల్ కేసులతో పాటు రాజీపడే కేసులను పరిష్కరించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. కోర్టుల్లో లేని కేసులను ప్రీ -లిటిగేషన్ ద్వారా న్యాయ సేవాధికార సంస్థలో పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు కిశోర్‌కుమార్, రవీందర్, సీఐలు శంకర్, శ్రీనివాస్, బండారి కుమార్, లింగయ్య పాల్గొన్నారు.

## వీసీలో పాల్గొన్న అధికారులు

ములుగురూరల్, ఫిబ్రవరి 28 : ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై, ఎల్ఆర్ఎస్‌పై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా నుంచి కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, సంపత్‌రావు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దని, ప్రతీ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్లకు స్పష్టమైన ఆదేశాలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ నెల 31లోగా ప్రజలు భూములను ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకొని 25శాతం రాయితీ పొందాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

WANTED TEACHERS
★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565